

మాటల్లో పెట్టి మాయ చేస్తారు..



- వలపు వలతో నిలువుదోపిడీ
- విలవిలలాడుతున్న బాధితులు
- బలహీనతలను క్యాష్ చేసుకుంటున్న ముఠాలు

కరీంనగర్ క్రైం, మే 18 (ఆంధ్రజ్యోతి): మనుషులను కిడ్నాప్‌చేసి డబ్బులు వసూలు చేయడం ఎక్స్‌టార్షన్ నేరం కిందకు వస్తుంది. అందమైన అమ్మాయిలను ఎరవేసి, బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు గుంజడం సెక్స్‌టార్షన్ కిందకు వస్తుంది. తాజాగా పురుషులే మహిళల గొంతుతో వలపు వల విసురుతున్నారు. ఆ వలకు చిక్కుకున్నవారిని నిలువు దోపిడీ చేస్తున్నారు. సామాజిక మాధ్యమాలను కొందరు కేటుగాళ్లు ఈజీమని కోసం ఉపయోగిస్తున్నారు. నమ్మించి, వంచించి అందినకాడికి దోచుకుంటున్నారు. అమ్మాయి పేరుతో వలపు వలలు విసురుతూ అమాయకులను బుట్టలోవేసుకుని అనంతరం బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతూ నిలువుదోపిడి చేస్తున్నారు. మరి కొన్ని ఘటనల్లో హోమో సెక్సువల్స్ ఇదేవిధంగా అమాయకులను మాయా మాటలు చెప్పి దగ్గరికి రప్పించుకుని చిత్రహింసలకు గురిచేసి నిలువుదోపిడికి పాల్పడుతున్నారు. ఇటువంటి ఘటనల్లో బాధితులు ఆర్థికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటువంటి ఘటనలు జిల్లాలో ఇటీవల తరుచూ జరుగుతున్నాయి.

● పరువు పోతుందని..

మనుషుల బలహీనతలను పెట్టుబడిగా పెట్టి వారితో నేరగాళ్లు ఆటలాడుకుంటున్నారు. ఇటువంటి నేరగాళ్ల బారినపడినవారు తమ పరువు పోతుందనే ఉద్దేశంతో పోలీసులను ఆశ్రయించేందుకు జంకుతున్నారు. నేరగాల్లు అడిగినంత ముట్టజెబుతూ సర్వం కోల్పోతున్నారు. చాలా మంది బాధితులు బయటకు చెప్పుకోలేక లోలోన మధనపడుతున్నారు. ఉద్యోగులు, వ్యాపారులు, రాజకీయనాయకులు కూడా వలపు వలలో చిక్కుకుంటున్నట్లు సమాచారం. బాధలు, వేధింపులు ఎక్కువైన సంఘటనల్లో మాత్రమే బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. తాజాగా కొత్తపల్లి మండలంలో జరిగిన ఘటనలో ముగ్గురు యువకులు ఒక ముఠాగా ఏర్పడి సామాజిక మాద్యమాల్లో పలువురికి మెస్సేజ్‌లు పంపించారు. మెస్సేజ్‌లకు స్పందించిన మంచిర్యాల జిల్లాకు చెందిన ఒక వ్యక్తిని తమ వద్దకు రప్పించుకుని శారీరకంగా, మానసికంగా హింసించి అతడి వద్ద డబ్బులు దోచుకున్నారు. ఈ నేర ఘటనలో పాల్గొన్నవారిలో ఒక నిందితుడు గతంలో చింతకుంటలో ఒక వ్యక్తి వద్ద డబ్బులు దోచుకోగా, మరో కేసులో బెదిరించి డబ్బులు దోపిడీ చేశాడు. జైలుకు వెళ్లివచ్చినా తీరు మార్చుకోలేదు. మరో ఇద్దరితో జతకట్టి మళ్లీ అదే విధంగా నేరం చేసి పోలీసులకు చిక్కాడు. ముక్కుమొఖం తెలియని వారితో చాట్ చేసి చిక్కుల్లో పడవద్దని, ఎక్కడికి రమ్మంటే అక్కడికి వెళ్లి కష్టాలు కొనితెచ్చుకోవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

● విచ్చలవిడిగా సైబర్ నేరాలు

సైబర్ నేరగాళ్లు కూడా ఈ విధమైన నేరాలకు పాల్పడుతున్న ఘటనలు అనేకం చోటుచేసుకుంటు న్నాయి. సైబర్ నేరగాళ్లు ఫోన్లలో పోర్న్‌సైట్, శృంగార పరమైన వీడియోలను వీక్షించేవారి సమాచారాన్ని మొదట సేకరించి అనంతరం వారికి వలపుల వలలు విసిరుతూ మోసాలకు పాల్పడుతున్నారు. పోర్న్‌సైట్, శృంగారపరమైన వీడియోలను వీక్షించేవారి ఫోన్, ఐపీ చిరునామా ద్వారా సైట్ల నిర్వాహకులకు తెలిసిపోతుంది. సైట్ల నిర్వాహకుల ద్వారా సైబర్ నేరగాళ్లు ఆ వివరాలను సేకరిస్తున్నారు. మొదట అందమైన అమ్మాయి డీపీ ఉన్న అకౌంట్ నుంచి హాయ్ అంటూ మెస్సేజ్ పంపిస్తారు. ఆ మెస్సేజ్‌కు స్పందించకుంటే కాల్ చేస్తారు. ఫోన్‌ఎత్తితే తియ్యటి మాటలతో అమ్మాయి లైన్‌లోకి వస్తుంది. కొద్దిగా పరిచయం కాగానే వీడియోకాల్ మాట్లాడుకుందామంటారు. అందుకు బాధితుడు సిద్ధమవగానే మరింత రెచ్చగొడతా తారు. మాటలతో మభ్యపెట్టి అవతలి వ్యక్తిని నగ్నంగా మారాలని ఉసిగొల్పుతారు. వారిమాటలకు లొంగిపోతే ఇక్లగుల్ల అయినట్లే. ఇద్దరి మధ్య జరిగే వ్యవహారమంతా రికార్డు చేసి, బెదిరింపులకు దిగుతారు. ఆ తరువాత షరా మామూలే.... మీ వీడియోలు మావద్ద ఉన్నాయి... వాటిని యూట్యూబ్‌లో పెడుతాం... అంటూ ఒక లింక్ పంపిస్తారు. అందులో బాధితుడి వీడియోలు దర్శనమిస్తాయి. అడిగినకాడికి ఇవ్వడం తప్ప మరో మార్గం లేకుండా పోతుంది. కొందరు ధైర్యం చేసి పోలీసులను ఆశ్రయిస్తున్నప్పటికీ ఈ కేసులు బయటకు రావడంలేదు.

● తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

- సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయం అయ్యే వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి.
- తెలియని నంబర్ల నుంచి వచ్చే అనుమానిత వీడియోకాల్స్, మెస్సేజ్‌లకు ఎట్టి పరిస్థితుల్లో స్పందిచవద్దు.
- తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్ట్‌లకు స్పందించవద్దు.

జమ్మికుంటలో భారీగా మక్కల నిల్వలు

- లైసెన్స్ లేకుండా తక్కువ ధరకు కొనుగోళ్లు
- మార్కెట్ ఫీజు ఎగవేత



జమ్మికుంట, మే 18 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలో కొంత మంది దళారులు భారీ స్థాయిలో మక్కలను అక్రమంగా నిల్వలు చేసినట్లు తెలిసింది. గత ఏడాది క్వింటాల్ మూడు వేల ధర పలికింది. ఈ ఏడాది అదే స్థాయిలో ధరలు పెరుగుతాయని ఆశించిన దళారులు రైతుల నుంచి తక్కువ ధరకు కొని పెద్ద ఎత్తున నిల్వలు చేసుకున్నారు. ప్రభుత్వ మద్దతు ధర 2,225 రూపాయలు కాగా, వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ మక్కలకు 2,050 నుంచి 2,100 చెల్లించి ఖరీదుదారులు కొన్నారు. ఇప్పటి వరకు యార్డు పరిధిలో 1.5 లక్షల క్వింటాళ్లను ఖరీదుదారులు కొనుగోలు చేసినట్లు మార్కెట్ లెక్కలు చెబుతున్నాయి. దళారులు 50 వేల క్వింటాళ్ల పైచిలుకు మక్కలు కొన్నారు. జీరో టాక్స్ కావడంతో ప్రైవేట్ వ్యక్తులు ఎలాంటి లైసెన్స్ లేకుండానే మక్కలను పోటీపడి రైతుల నుంచి కొనుగోలు చేశారు. మక్కలకు మార్కెట్ ఫీజు ఒక శాతం చెల్లించాల్సి ఉంటుంది. దళారులు మాత్రం అవన్నీ మాకు తెలియదు, మా రూటే సపరేటు అన్న మాదిరిగా ఫీజుకు ఎగవేస్తూ మార్కెట్ ఆదాయానికి గండి కొడుతున్నారు.

● 50 వేల క్వింటాళ్ల అక్రమ నిల్వలు

జమ్మికుంట పరిధిలో 50 వేల క్వింటాళ్ల పైచిలుకు మక్కల అక్రమ నిల్వలు ఉన్నట్లు తెలిసింది. సగటు ధర క్వింటాల్‌కు 2,100 రూపాయల ప్రకారం 50 వేల క్వింటాళ్లకు 10.5 కోట్లు విలువ చేస్తుంది. ఈ యేడు ప్రభుత్వ రంగ సంస్థ మార్క్‌ఫెడ్ కొనుగోళ్లకు దూరంగా ఉండడంతో దళారులు చెలరేగి పోయారు. ప్రభుత్వ మద్దతు ధర కంటే 125 నుంచి 175 రూపాయలు రైతుల నుంచి కొనుగోలు చేశారు. దీంతో రైతులు 87.5 లక్షల వరకు నష్టపోవాల్సి వచ్చింది. మక్కలు అమ్ముకున్న రైతులకు పూర్తి స్థాయిలో దళారులు డబ్బులు చెల్లించనట్లు తెలుస్తుంది.

● లైసెన్స్ లేని ట్రేడర్లకు నోటీస్‌లు జారీ

లైసెన్స్ లేకుండా తమకు ఇష్టం వచ్చిన ధరలకు రైతుల నుంచి మక్కలు కొనుగోలు చేస్తున్న వారిని గుర్తించిన మార్కెట్ పాలకవర్గం ఇటీవల నోటీసులు జారీ చేసింది. ఇప్పటి వరకు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైన ఉన్నతాధికారులు పూర్తి స్థాయి విచారరణ జరిపి దళారులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మద్యం ధరలను పెంచిన ప్రభుత్వం

- మద్యంప్రియులపై అదనపు భారం
- విస్కీ ధరల పెంపు, బీరు ధరలు యధాతథం...

కరీంనగర్ క్రైం, మే 18 (ఆంధ్రజ్యోతి): మద్యం ధరలను రాష్ట్ర ప్రభుత్వం పెంచుతూ ఆదివారం సర్క్యులర్‌ను జారీ చేసింది. విస్కీ, బ్రాంది, రమ్ వంటి మద్యం ధరలను మాత్రమే పెంచింది. బీరు, బ్రీజర్ ధరలను యధాతథంగా ఉంచుతూ ఎక్సైజ్‌శాఖ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. విస్కీ ఫుల్ బాటిల్‌పై 40, హాఫ్‌పై 20, క్వార్టర్ బాటిల్‌పై 10 రూపాయలు పెంచారు. ఈ పెంచిన ధరలను మద్యం షాపులకు ఆదివారం పంపించడంతో కొందరు మద్యం వ్యాపారులు ఆదివారం నుంచే పెంచిన ధరలను అమలు చేస్తున్నారు. బీరు ధరలను ప్రభుత్వం ఫిబ్రవరి నెలలోనే పెంచడంతో వాటి ధరలపెంపు జోలికి ప్రభుత్వం పోలేదు. పెంచిన ధరలను ప్రభుత్వం స్పెషల్ ఎక్సైజ్ సెస్‌గా పేర్కొన్నట్లుగా తెలిసింది. పెంచిన ధరల్లో వ్యాపారులకు ఎలాంటి మార్జిన్ రాకుండా ప్రభుత్వానికి ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఇదివరకు మద్యం ధరలను బ్రాండ్ల వారీగా పెంచేవారు. ప్రస్తుతం స్పెషల్ ఎక్సైజ్ సెస్ రూ పంలో పెంచటంతో అన్ని రకాల విస్కీలకు ఒకే విధంగా ధరలను పెంచారు. ధరల పెంపుతో మద్యం ప్రియులపై అదనపు భారం పడనుంది. జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో 10,20,439 పెట్టెల విస్కీ అమ్మకాలు జరిగాయి. ఒక్కో పెట్టెలో 12 ఫుల్‌బాటిళ్ల లేదా 24 హాఫ్ బాటిళ్ల లేదా 48 క్వార్టర్ బాటిళ్ల ఉంటాయి. లెక్కన ఒక్కో పెట్టెకు 480 రూపాయలు ధర పెరుగు తుంది. పెంచిన ధరలతో ప్రభుత్వానికి 49 కోట్ల వరకు అదనపు ఆదాయం సమకూర నుంది. ఇది మద్యం ప్రియులకు భారంగా మారనుంది.



22న కరీంనగర్ రైల్వే స్టేషన్ ప్రారంభం

- ఆర్వోబీ పనులు త్వరగా పూర్తి చేస్తాం
- తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్

కరీంనగర్ రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రైల్వే స్టేషన్‌ను ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఈ నెల 22న వర్చువల్‌గా ప్రారంభిస్తారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ తెలిపారు. కరీంనగర్ రైల్వేస్టేషన్‌ను ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈనెల 22న ప్రదాన మంత్రి నరేంద్రమోదీ దేశ వ్యాప్తంగా 102 రైల్వే స్టేషన్లను వర్చువల్‌గా ప్రారంభించబోతున్నారని తెలిపారు. కరీంనగర్ రైల్వేస్టేషన్‌నూ అదే రోజు ప్రారంభిస్తారన్నారు. హైదరాబాద్ గుల్జార్ హౌస్ ప్రమాద ఘటనలో 17 మంది మరణించడం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. చిన్నారులు కూడా మరణించడం బాధకరణమని అన్నారు. దీనిపై కేంద్రం స్పందించిందని తెలిపారు. ప్రదాని నరేంద్ర మోదీ మృతులకు రెండులక్షల రూపాయలు ఆర్థిక సాయం, గాయపడిన వారికి 50 వేల రూపాయలు ప్రకటించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంంతాపంతోనే సరిపెట్టడం శోచనీయమన్నారు. వారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్రం ఇప్పటి వరకు లక్షన్నర కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. తెలంగాణకు ఎన్ని నిధులు కేటాయించాము, ఏ విధమైన అభివృద్ధి చేశామనే అంశం పై శ్వేత పత్రం విడుదల చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని, రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పూర్థిస్థాయిలో సహకరించడం లేదని తెలిపారు. విమర్శలకే పరిమితమవుతూ అభివృద్ధికి అడ్డుగా మారుతుందన్నారు. ఇకనైనా రాష్ట్ర అభివృద్ధి విషయంలో కలిసి రావాలని కోరారు. కరీంనగర్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ కోసం 33.3 కోట్లు ఖర్చయ్యాయని తెలిపారు. తీగలగుట్టపల్లి ఆర్వోబీ పనులను కొత్త కాంట్రాక్టర్‌కు అప్పజెప్పామని, వచ్చే జూన్ వరకు పూర్తి అవుతాయని తెలిపారు. ఇప్పటికీ భూ సేకరణ పూర్తికాకపోవడం కాస్తా ఇబ్బందిగా మారిందని, కొత్త కాంట్రాక్టర్ పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కరీంనగర్ రైల్వేస్టేషన్ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. త్వరలోనే జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను కూడా ఆధునీకరిస్తామని తెలిపారు. కరీంనగర్‌లో బడ్జెట్ కంటే మరో రెండు కోట్ల రూపాయలు అదనంగా వెచ్చించి రోడ్లు, మురికి కాలువలు నిర్మించామన్నారు. జూన్ నాటికి ప్రజల రాక పోకలకు ఇబ్బంది లేకుండా వన్ లైన్ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. కరీంనగర్-తిరుపతి రైలు డైలీ సర్వీస్‌గా మార్చేందుకు సాధ్యాసాధ్యాలను రైల్వే శాఖ పరిశీలిస్తోందని తెలిపారు. కరీంనగర్ - జగిత్యాల జాతీయ రహదారి విస్తరణ పనులను మూడు నెలల్లో టెండర్లు పూర్తవుతాయని తెలిపారు. ఈ అంశంపై కేంద్ర మంత్రి గడ్కరీతో ఇటీవల మాట్లాడనని తెలిపారు. తీగల గుట్టపల్లి ఆర్వోబీ పనులపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. సంబంధిత అదికారులను పిలిచి కారణాలను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో బీజేపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, వసాల రమేష్, మాజీ మేయర్ సునీల్‌రావు, మాజీ డిప్యూటి మేయర్ గుగ్గిళ్ల రమేష్, కొలగాని శ్రీనివాస్, తాళ్లపల్లి శ్రీనివాస్, రైల్వే మేనేజర్ రవీందర్, అధికారులు పాల్గొన్నారు.

కరీంనగర్ రైల్వేస్టేషన్



యువజన సంఘాలకు ఆదరణ కరువు

- కార్యక్రమాల్లో భాగస్వాములను చేయని నెహ్రూ యువ కేంద్రం
- జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులను సాధించిన వారినీ పట్టించుకోని వైనం

4

ఉపాధి హామీలో చేపల కొలనులు

- కరీంనగర్ రూరల్ మండలానికి 12 మంజూరు
- ఒక్కో కొలనుకు రూ. 8.5 లక్షలు

కరీంనగర్ రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం గ్రామాల్లో చేపల పెంపకం చేపట్టేందుకు చర్యలు చేపట్టింది. జాతీయ ఉపాధి హామీ పథకంలో చేపల కొలనుల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తోంది. 2005-26 ఆర్థిక సంవత్సరంలో కరీంనగర్ మండలానికి 12 చేపల కొలనుల యూనిట్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం చెర్లబూత్కూర్, దుబ్బపల్లి, ఫకీర్‌పేట, ఇరుకుల్ల, మొగ్దుంపూర్, నగునూర్ గ్రామాల్లో ఆరు చేపల కొలనులు నిర్మాణ పనులు నడుస్తున్నాయి. ఒక్కో కొలను 20 మీటర్ల పొడవు, 15 మీటర్ల వెడెల్పు 2 మీటర్ల లోతుతో నిర్మిస్తున్నారు. ఒక యూనిట్‌లో నాలుగు చేపల కొలనుల చొప్పున తవ్వుతున్నారు. ఒక చేపల కొలను నిర్మాణానికి మొత్తం 2,600 పనిదినాలను కూలీలకు కల్పించాల్సి ఉండగా, సుమారు 8.5 లక్షల రూపాయల వరకు ఖర్చు అవుతుందని ఉపాధిహామి అధికారులు తెలిపారు. ఆయా గ్రామాల్లో కొలనులు తవ్వేందుకు కూలీలు పెద్ద సంఖ్యలో తరలిస్తున్నారు. చేపల కొలనుల నిర్మాణంతో కూలీలకు పని లభిస్తుంది. వేసవి కాలం పూర్తయ్యేలోగా అన్ని గ్రామాల్లో చేపల కొలనులు నిర్మాణం పూర్తి చేయనున్నట్లు ఏపీవో శోభరాణి తెలిపారు. ఉపాధిహామీ పథకంలో చేపల కొలనుల నిర్మాణం పూర్తయితే వర్షాలు కురిసిన సమయంలో నీళ్ళు నిల్వ ఉండటంతో చేపలు పెంచుకునేందుకు అవకాశం ఉంటుంబది. ఆయా గ్రామాల్లోని చేపల కొలనుల్లో చేపలను పెంచేందుకు మత్స్యకారులకు డీఆర్‌డీఏ ద్వారా రుణాలను మంజూరు చేయనున్నారు. ఒక్కొక్కరికి 2లక్షల రూపాయల నుంచి 3లక్షల వరకు రుణంతో చేపల పిల్లల కొనుగోలు, దాణా, నీటి వసతికి ఖర్చు చేయాల్సి ఉంటుంది.



చెరువులో ఉపాధిహామీ పనుల్లో భాగంగా చేపల కొలను తీస్తున్న కూలీలు

ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు

ఉచితంగా బీటెక్

● గత యేడాది 250 మందికి లబ్ధి

కరీంనగర్ టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ చదివిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఇంజనీరింగ్ కళాశాలల్లో ఉచిత విద్యను అందిస్తుంది. రెండేళ్ల క్రితం ఈ పథకాన్ని ప్రారంభించారు. మొదటి సంవత్సరంలోనే జిల్లాలో 250 మందికి పైగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు ర్యాంకులతో ప్రమేయం లేకుండా ఉచితంగా బీటెక్ విద్యను అందిస్తుంది. ఎంసెట్‌లో పదివేల కంటే ఎక్కువ ర్యాంకు వచ్చినా పూర్తి ఫీజు రీయంబర్స్‌మెంట్ అందించనుంది. విద్యార్థులు కౌన్సెలింగ్ రోజు ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు సంబందించిన పత్రాలను తప్పకుండా తీసుకెళ్ళాల్సి ఉంటుంది. 2025-26 విద్యాసంవత్సరానికి సంబందించి జూన్ చివరి వారంలో మొదటి దశ కౌన్సెలింగ్ ప్రారంభమవుతుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంలో భాగంగా ఎంసెట్ పదివేల లోపు ర్యాంకు వచ్చిన వారికి ఏ కాలేజీలో సీటు వచ్చినా పూర్తి ఫీజును ప్రభుత్వమే చెల్లిస్తుంది, పదివేల పైన ర్యాంకు వచ్చిన మైనార్టీ విద్యార్థులు తమ కుటుంబ ఆదాయం ప్రభుత్వం నిర్ణయించిన స్థాయికంటే తక్కువే ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం సమర్పిస్తే పూర్తి ఫీజును ప్రభుత్వం చెల్లిస్తుంది. పదివేల పైన ర్యాంకు వచ్చిన బీసీ విద్యార్థులకు 35 వేల ఫీజు రీయింబర్స్‌మెంట్‌గా చెల్లిస్తుండగా, మిగతా ఫీజును విద్యార్థులే భరించాలి. తాజా నిర్ణయం ప్రకారం సర్కారు కాలేజీల్లో చదివిన విద్యార్థుల ఫీజును ప్రభుత్వమే చెల్లిస్తుంది. ప్రభుత్వ కాలేజీలతో పాటు, రెసిడెన్షియల్, గురుకులాలు, కార్పొరేట్ కాలేజీ స్కీమ్‌లలో లబ్ధిపొందిన విద్యార్థులకు కూడా ఈ పథకం వర్తించనుంది. కౌన్సెలింగ్ తర్వాత వెబ్ ఆప్షన్లు పెట్టుకునే సమయంలో వీలైనన్ని ఎక్కువ ఆప్షన్లు ఇచ్చుకుంటే మంచి కాలేజీల్లో సీట్లు వచ్చే అవకాశం ఉంది.



అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



తిరుపతిరెడ్డి(ఫైల్)

సైదాపూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయికల్ గ్రామానికి చెందిన రావుల తిరుపతిరెడ్డి(38) అనేరైతు ఆర్థిక ఇబ్బందులతో ఆదివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకొన్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలప్రకారం.. శనివారం రాత్రి తిరుపతిరెడ్డి భార్య పిల్లలు, ఇంటి బయట పడుకున్నారు. తిరుపతిరెడ్డి మాత్రం ఇంట్లోని బెడ్‌రూంలో కూలరు వేసుకొని పడుకున్నాడు. ఉదయం అతని భార్య కవిత లేచి తలుపు దగ్గరకు వెళ్లి ఎంత పిలిచినా లేవలేదు. ఫోన్ చేసిన ఎత్తలేదు. దీంతో తలుపులను బలంగా తన్నడంతో తలుపులు తెరుచుకున్నాయి. లోపలికి వెళ్లి చూసేసరికి తిరుపతిరెడ్డి చీరతో దూలానికి ఉరి వేసుకొని చనిపోయి ఉన్నాడని వారు తెలిపారు. తమకు 2.20ఎకరాల భూమి ఉన్నదని, వ్యవసాయం చేసుకొని జీవిస్తుంటామని తిరుపతి రెడ్డి భార్య కవిత పేర్కొంది. వ్యవసాయం కోసం సుమారు 10లక్షల వరకు అప్పు అయిందని అన్నారు. దీనికి తోడు ఇద్దరు ఆడ పిల్లలున్నారని అప్పులు ఎలా తీర్చాలనే మనస్థాపంతోనే తన భర్త మృతి చెందాడని కవిత తెలిపారు. ఈ మేరకు మృతుడి భార్య కవిత ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జీ ఎస్సై భార్గవ్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వివాహిత బలవన్మరణం

ఎల్లారెడ్డిపేట, మే 18 (ఆంధ్రజ్యోతి) : ఓవైపు భర్త అనారోగ్యం.. మరో వైపు ఆర్థికఇబ్బందులు తట్టుకోలేక మనస్థాపం చెందిన వివాహిత నరెడ్ల స్వప్న(32) ఉరి వేసుకుని బలవన్మరణానికి ఒడిగట్టింది. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని స్వప్న భర్త సత్యం ద్విచక్రవాహన మెకానిక్‌గా పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. యేడాది కిందట అనారోగ్యానికి గురయ్యాడు. దాంతో కుటుంబ పోషణ భారం స్వప్నపై పడింది. భార్యభర్తల నడుమ మనస్పార్థాలు నెలకొనడంతో స్వప్న పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. రెండు నెలల కిందట గ్రామానికి చేరుకున్న ఆమె భర్త అనారోగ్యంతో బాధ పడుతుండడం.. పిల్లల పోషణకు ఆర్థిక ఇబ్బందులతో సతమతమైంది. మనస్థాపం చెందిన స్వప్న గదిలోని వెళ్లి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన ఆమె కూతురు సాత్విక భయంతో కేకలు వేస్తూ చుట్టుపక్కల వారికి చెప్పింది. అక్కడకు చేరుకున్న చుట్టుపక్కల వారు మృతదేహాన్ని కిందకు దింపారు. ప్రొబేషనరీ ఎస్‌ఐ లక్ష్మణ్ ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని లక్ష్మణ్ వివరించారు. మృతురాలికి భర్త సత్యం, కొడుకు సన్నిహిత్, కూతురు సాత్విక ఉన్నారు.

ఉరి వేసుకుని వృద్ధుడి ఆత్మహత్య



ముత్తయ్య(ఫైల్)

చందుర్తి, మే 18 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యం, ఒంటరితనం ఆరోగ్య సమస్యలతో పాటు కంటిచూపు మందగించడంతో ఓ వృద్ధుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొండ ముత్తయ్య (65) ఒంటరితనం, అనారోగ్య సమస్యలతో పాటు కంటి చూపు మందగించడంతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య పది సంవత్సరాల క్రితం మృతిచెందింది. రెండో కుమారుడు మధు డ్రగ్స్‌కు అలవాటు పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెద్ద కుమారుడు స్వామి సౌదీ వెళ్లాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజయ్య తెలిపారు.

ధాన్యం కుప్పలను ఢీకొని ఒకరి మృతి



రంజిత్‌కిరణ్ (ఫైల్)

తిమ్మాపూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపైన రైతులు ఆరబోసిన దాన్యం కుప్పలను ఢీకొని ద్విచక్రవాహనదారుడు మృతి చెందిన సంఘటన మండలంలోని మల్లాపూర్‌లో చోటుచేసుకుంది. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ రూరల్ మండలం మొగ్ధుంపూర్ గ్రామానికి చెందిన నేరెళ్ల రంజిత్‌కిరణ్(32) తన స్నేహితుడు సాజిద్‌తో కలిసి మల్లాపూర్‌లోని స్నేహితుడిని కలిసేందుకు శనివారం సాయంత్రం బైక్‌పై వచ్చారు. తిరిగి అర్ధరాత్రి కరీంనగర్‌కు వెళుతుండగా మల్లాపూర్ గ్రామానికి చెందిన మామిడిసతీష్ అనేరైతు రోడ్డుపై పోసిన ధాన్యం కుప్ప కనిపించక దానిని ఢీకొట్టారు. దీంతో బైక్ అదుపుతప్పి కిందపడడంతో రంజిత్‌కిరణ్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సాజిద్‌కు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కరీంనగర్ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి భార్య రితిక ఫిర్యాదు మేరకు రైతు మామిడి సతీష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు. సంఘటనా స్థలాన్ని సీఐ సదన్ కుమార్ సందర్శించి రైతులు రోడ్డుపై ధాన్యం ఆరపోయవద్దని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

సుల్తానాబాద్, మే 18: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుగ్లాంపల్లి గ్రామంవద్ద రాజీవ్ రహదారిపై ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. సుగ్లాంపల్లి వద్ద నుంచి రోడ్డు పక్క నుంచి నడుచుకుంటూ వస్తుండగా పెద్దపల్లి నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ట్రాలీవాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. అయితే ప్రమాదానికి కారణమైన ట్రాలీ ఆపకుండా వెళ్తుండగా సుగ్లాంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ ఈర్ల వెంకటేశ్వర్లు ద్విచక్ర వాహనంపై వెంబడించి ట్రాలీని పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకున్నారు. మృతుడు మతిస్థిమితంలేని వ్యక్తిగా భావిస్తున్నారు. ప్రమాదానికి కారకుడైన ట్రాలీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ట్రాలీని కూడా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

యువజన సంఘాలకు ఆదరణ కరువు

- కార్యక్రమాల్లో భాగస్వాములను చేయని నెహ్రూ యువ కేంద్రం
- జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులను సాధించిన వారినీ పట్టించుకోని వైనం



గణేశ్‌నగర్, మే 18 (ఆంధ్రజ్యోతి): గతంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యువజన సంఘాలు చురుకుగా పని చేసేవి. నెహ్రూ యువ కేంద్రం (ఎన్‌వైకే) ఆధ్వర్యంలో సంవత్సరం పొడువునా కార్య క్రమాలు నిర్వహించేవారు. రాను రాను కార్యక్రమా లు తగ్గిపోయాయి. ఒకప్పుడు సందడిగా ఉండే ఎన్‌వైకే ఇప్పుడు నిర్మానుష్యంగా మారింది.

● నామమాత్రంగా కార్యక్రమాలు

గ్రామీణ ప్రాంతంలోని యువతీ, యువకులను, యువజన సంఘాల సభ్యులను జాతి నిర్మాణంలో పాల్గొనేలా అవకాశాలను కల్పించేందుకు నెహ్రూ యువ కేంద్రాలను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేశారు. కరీంనగర్‌లో 1988లో నెహ్రూ యువ కేంద్రం ఏర్పాటు చేశారు. ఘన చరిత్ర ఉన్న కరీంనగర్ నెహ్రూ యువ కేంద్రం దశాబ్ద కాలంగా నామమాత్రంగా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. గ్రామీణ ప్రాంత యువజన సంఘాలను సమన్వయం పరచడం, యువజన సాధికారతపై దృష్టి కేంద్రీకరించడం లేదు. గతంలో యువజన ఉత్సవాలు ఘనంగా నిర్వహించేవారు. ఉమ్మడి జిల్లా నుంచి పలువురు ఉత్సవాల్లో పాల్గొని జిల్లాస్థాయి, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో అవార్డులు అందుకున్నారు. ప్రస్తుతం ఆ కార్యక్రమాలేవీ నిర్వహించడం లేదు. సంవత్సరంలో ఒకటి, రెండు కార్యక్రమాలను నామమాత్రంగా నిర్వహిస్తున్నారు. వాటిలోనూ యువజన కేంద్రాలకు భాగస్వామ్యం కల్పించడం లేదు.

● కోర్సుల ఊసే లేదు...

నెహ్రూ యువ కేంద్రంలో కుట్టు మిషన్, టైలరింగ్, బ్యూటిషన్ కోర్సులు నిర్వహించేవారు. ప్రస్తుతం అవి మచ్చుకైనాఆ లేదు. కలెక్టర్ ఈ విషయంపై దృష్టి సారించాలని యువజన సంఘాల నేతలు కోరుతున్నారు. యువజన సంఘాల సారథ్యంలో క్రీడా పోటీలను బ్లాక్, జిల్లా స్థాయిలో పోటీలను గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించేవారు. ప్రస్తుతం అవి కనుమరుగయ్యాయి.

● నాయకులకు ప్రాధాన్యం కరువు

సామాజిక సేవే పరమావధిగా తమ జీవితాలను పణంగా పెట్టి జిల్లాలోని పలువురు యువజన సంఘాల నాయకులు నెహ్రూ యువ కేంద్రానికి అనుబంధంగా పనిచేశారు. యువజన చైతన్య సదస్సులు, శ్రమదానం, మొక్కలు నాటడం వంటి స్వచ్ఛంద సేవ, స్వయంసేవా లాంటి కార్యక్రమాలతో పాటు యువజన సంఘ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించారు. జిల్లాకు రాష్ట్ర, జాతీయ స్థాయిలలో సామాజిక సేవా విభాగంలో ఉత్తమ యువజన అవార్డులు తెచ్చిపెట్టారు. ఇప్పుడు తమను పట్టించుకునే వారేలేరనివారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● వార్షిక ప్రణాళిక మాటే లేదు

నెహ్రూ యువ కేంద్రంలో వార్షిక ప్రణాళిక ఊసే ఎత్తడం లేదు. యువతకు ఇచ్చే శిక్షణలు, చేపట్టే కార్య క్రమాలు, వచ్చిన బడ్జెట్ ఎంత తదితర వివరాలను కేంద్రంలోని నోటీస్ బోర్డ్‌పై ఉంచాలి. ఈ నిబంధనను పట్టించుకున్న వారే లేరు. నెహ్రూ యువ కేంద్రం ద్వారా గ్రామీణ యువజన సంఘాలకు చేరాల్సిన నిధులను ఇష్టారాజ్యంగా ఖర్చు పెడుతున్నారనే విమర్శలున్నాయి. జిల్లా అధికారులు నెహ్రూ యువ కేంద్రంపై దృష్టి సారించి ఎన్‌వైకేకు గత వైభవం తీసుకు రావాలని యువజన సంఘాల నాయకులు కోరుతున్నారు.

యువజన సంఘాలను పట్టించుకోవడం లేదు

\- మెతుకు హేమలత, హేమలత ఫౌండేషన్ అధ్యక్షురాలు



రిజిస్టర్ చేసుకొన్న సంఘాలకు సరైన గుర్తింపు ఇవ్వడం లేదు. నెహ్రూ యువ కేంద్రం ద్వారా చేపట్టే కార్యక్రమాలకు యువజన సంఘాలకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదు. గ్రామాల్లో యువజన కార్యక్రమాలను ప్రోత్సహం కరువైంది. ప్రత్యేకంగా మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించాలి..

\- కొండ రవి, జాతీయ యువజన అవార్డ్ గ్రహీత



గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించాల్సిన కార్యక్రమాలను జిల్లా కేంద్రంలోని ప్రైవేటు విద్యా సంస్థల్లో నిర్వహిస్తున్నారు. కార్యక్రమాలను గ్రామీణ ప్రాంతాల్లోనే నిర్వహించాలి. ప్రతి కార్యక్రమంలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డు గ్రహీతలను భాగస్వాములను చేయాలి.

అందరినీ భాగస్వాములు చేయాలి

\- సత్తినేని శ్రీనివాస్, రాష్ట్ర యువజన అవార్డు గ్రహీత



యువజన, మహిళా సంఘాలను, అవార్డు గ్రహీతలను ఎన్‌వైకే కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలి. ప్రభుత్వాలు ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకలను గ్రామీణ ప్రాంతలకు చేరవేసేందుకు అందరి భాగస్వామ్యం అవసరం.

కలెక్టర్ చొరవ చూపాలి

\- అనభేరి నిత్రీషారావు, యువ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్



నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో యువజన సంఘాల పాత్ర చాలా కీలకమైనదీ. యువజన సంఘాలను, యువజన అవార్డు గ్రహీతలను భాగస్వామ్యం చేసే విధంగా కలెక్టర్ చొరవ చూపి సమావేశాలు నిర్వహించి యువజన కార్యక్రమాలను ప్రోత్సహించాలి.

రాళ్లవాగు కుడి కాలువకు మహర్దశ కలిగేనా?

● నేడు ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల ఇరిగేషన్ ఈఎన్‌సీలతో ప్రభుత్వ విప్ సమీక్ష



రాళ్లవాగు కాలువలో అడ్డుగా ఉన్న పొదలు

కథలాపూర్, మే 18 (ఆంధ్రజ్యోతి) : రాళ్లవాగు ప్రాజెక్ట్ కుడి కాలువకు ఎప్పుడు మహర్దశ పడుతుందా అని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. సోమవారం ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ ఇరిగేషన్ ఈఎన్‌సీలతో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ కాలువను పరిశీలించి సమీక్ష చేయనున్నారు. ఈ ప్రాజెక్ట్ నిజామాబాద్‌జిల్లా కమ్మరిపల్లి మండలంలోని కోనాపూర్ అడవుల్లో 2005లో అప్పటి వైఎస్ఆర్ ప్రభుత్వం జలయజ్ఞంలో భాగంగా నిర్మించింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా దాదాపు 3 వేలఎకరాల బీడు భూమిని సాగులోకి తెచ్చేందుకు నిర్మాణం చేశారు. జగిత్యాల జిల్లాలోని భూషణరావుపేట, కథలాపూర్, పెగ్గెర్ల, ఊట్‌పల్లి గ్రామాల్లోని భూములను సస్యశ్యామలం చేయడానికి నిర్ణయం చేశారు. అయితే కుడి కాలువ తూము నుంచి వచ్చే నీటితో పాటు పైభాగం నుంచి వచ్చే వరద నీటి ప్రవాహం కారణంగా ఏటా నక్కల ఒర్రె ప్రాంతంలో తెగిపోతుంది. ఇరిగేషన్ అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేస్తున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. కాలువ తెగిపోయి చివరి భూములకు నీరందని పరిస్థితి ఎదురవుతోందని రైతులు వాపోతున్నారు. ఎడమ కాలువ ద్వారా 164 ఎకరాలు, కుడి కాలువ ద్వారా 2700 ఎకరాల మేర సాగు కావాల్సి ఉంది.

● రెండు జిల్లాల అధికారుల సమన్వయం కరువు

ఈ కాలువ అటు ఆర్మూర్, ఇటు రాజన్న సిరిసిల్ల జిల్లాల పరిధిలో ఉండడంతో తెగిపోయిన సందర్భంలో రెండు జిల్లాల అధికారులు మరమ్మతుల కోసం అంచనాలు వేయాల్సి ఉంటుంది. దీంతో కాలయాపన జరిగి కాలువ మరమ్మతులకు నోచుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఐదు నెలల క్రితం నక్కల ఒర్రె వద్ద పడ్డ గండిని పూడ్చడానికి కమ్మర్‌పల్లి ఇరిగేషన్ అధికారులు రూ.21 లక్షలతో కల్వర్టు నిర్మించారు. అయితే అదే ప్రాంతంలో మళ్లీ భారీ గండి పడి నీరంతా వృథాగా పోయింది. మళ్లీ అంచనాలు వేయాలంటే రెండు ఉమ్మడి జిల్లాల అధికారులు సమన్వయం చేసుకోవాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. పలుమార్లు జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల పరిధిలోకి ప్రాజెక్ట్‌ను మార్చాలని రైతులు చేసిన విన్నపాలు పట్టించుకోవడం లేదు.

● సిమెంట్ లైనింగ్ వేయడమే శాశ్వత పరిష్కారం

తరచూ కాలువ తెగిపోతున్న క్రమంలో కాలువతో అవసరమున్న ప్రదేశాన్ని గుర్తించి శాశ్వతంగా సిమెంట్‌తో లైనింగ్ నిర్మాణం చేపడితేనే పరిష్కారం లభిస్తుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఐదు పిల్ల కాలువలకుగాను 2010లో రెండు మాత్రమే నిర్మించారు. అయితే కాలువల్లో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించకపోవడం వల్ల ఆ పనులు అటకెక్కాయి. నష్టపరిహారం చెల్లింపుతో పాటు కాలువకు శాశ్వత పరిష్కారం చూపించాలని రైతులు కోరుతున్నారు.

ధాన్యం కుప్పను ఢీకొని ముగ్గురికి గాయాలు

వీణవంక, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్భాపూర్ గ్రామశివారులో ద్విచక్రవాహనం ధాన్యం కుప్పలను ఢీకొనగా ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్థుల వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా పరకాల నుంచి ద్విచక్రవాహనంపై వీణవంక మండలం కోర్కల్‌గ్రామానికి కంచె కిరణ్, కంచెపావని, కుమారుడు రాఘవతో కలిసి వెళ్తున్నారు. ఈ క్రమంలో వరిధాన్యం కుప్పలు ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు108కి సమాచారం అందించగా వరంగల్ అసుపత్రికి తరలించారు. రోడ్డుపై పోసిన ధాన్యం కుప్పలతో వారంలో ఇద్దరు మృతిచెందగా నలుగురికి తీవ్రగాయాలయ్యాయి.

పేకాటరాయుళ్ల అరెస్ట్

బీర్‌పూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓపాతఇంటిలో ఆరుగురు పేకాటరా యుళ్లను బీర్‌పూర్ ప్రొబేషనరీ ఎస్సై తన సిబ్బందితో దాడిచేసి పట్టుకున్నట్లు ఎస్సైతెలిపారు. వారి నుంచి 8,500రూపాయలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

గాజులపల్లిలో ఆరుగురు అరెస్టు..

మంథనిరూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులపల్లి గ్రామశివారులో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను ఆదివారం పట్టుకున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. డబ్బులు పెట్టి మూడు కమ్మల పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బావిలో పడి రెండు గేదెలు మృతి

రాయికల్, మే 18 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని చెర్లకొండాపూర్ గ్రామంలో ప్రమాదవశాత్తు బావిలో పడి ఆదివారం రెండు గేదెలు మృతిచెందాయి. నానం సుమలత, ములాసపు మహేశ్వరీలకు చెందిన రెండు గేదెలు ఆదివారం మేత మేయటానికి గ్రామ శివారులోకి వెళ్లాయి. ఎండతీవ్రంగా ఉండటంతో సమీపంలోని బావి వద్దకు నీటిని తాగటానికి వెళ్లి అందులో పడి గేదెలు మృతిచెందాయి. గేదెల విలువ 80 వేల రూపాయల వరకు ఉంటుందని ప్రభుత్వం నష్టపరిహారం అందిచాలని బాధితులు కోరారు.

అస్తవ్యస్తంగా వాహనాల పార్కింగ్



కొండగట్టు పై జంక్షన్ వద్ద రహదారులకు అడ్డంగా నిలిపిన వాహనాలు

మల్యాల, మే 18 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో వాహనాలు పార్కింగ్ అస్త్యవ్యస్తంగా ఉందని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాలకు తగినట్లు పార్కింగ్ ఏర్పాట్లు చేయకపోవడంతో ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గాలు ఇరువైపులా వాహనాలను నిలుపుతుండడంతో ట్రాఫిక్ జాం అయి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ఆదివారం ఉదయం పై జంక్షన్ ప్రాంతంలో మూడు మార్గాలకు అడ్డంగా వాహనాలు నిలిపి ఉంచడంతో వాహనాల రాకపోకలకు గంటల తరబడి భక్తులు అసౌకర్యానికి గురయ్యారు.

శిథిలావస్థలో ఎస్సారెస్పీ క్వార్టర్లు

- ప్రహరీ లేక ఆక్రమణలు
- దశాబ్దాల తరబడి నిరుపయోగం
- పట్టించుకోని పాలకులు



శిథిలావస్థకు చేరిన అధికారుల క్వార్టర్లు

సుల్తానాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణ నడిబొడ్డులో ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు చెందిన ఆస్తులు నిరుపయోగంగా ఉన్నాయి. దశాబ్దాల తరబడి వాటిని అలాగే వదిలేయడం మూలంగా అధికారులు, ఉద్యోగుల, సిబ్బంది నివాసగదులు క్వార్టర్లు పలు కార్యాలయాలు శిథిలావస్థకు చేరాయి. అక్కడక్కడ కూలిపోతున్నాయి. వీటిని ఎవరూ పట్టించుకోకపోవడంలేదు. వాటిని మరమ్మతులు చేయించడమో లేక కూల్చివేయమో చేసి భూములను కాపాడాల్సిన అవసరం ఉంది. లేదా శిథిలావస్థకు చేరిన క్వార్టర్లను బాగుచేసి ఇతర ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు ఇస్తే బావుండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులు, కుటుంబాలు ఇక్కడ నివాసముంటూ ప్రభుత్వ క్వార్టర్లను దర్జాగా ఉపయోగించుకున్నారు.ఎస్సారెస్పీ భూములకు రక్షణ లేకుండా పోయింది. ప్రహరీ లేకపోవడం మూలంగా చుట్టు పక్కల కొంతభూములు ఆక్రమించుకుని నిర్మాణాలు చేసినట్లుగా ఆరోపణలు ఉన్నాయి.

● కాలువల తవ్వకం కోసం క్యాంప్ ఏర్పాటు

సుల్తానాబాద్ ప్రాంతంలో శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు కాలువల నిర్మాణం పనులు ప్రారంభదశలో ఆ నిర్మాణాలు పర్యవేక్షించడం కోసం సుల్తానాబాద్ పట్టణంలోని నీరుకుళ్ల రోడ్డులో, డీ- 86 ప్రదాన కాలువకు సమీపంలో ఎస్సారెస్పీ ఇంజనీరింగ్ విభాగంతోపాటు పర్యవేక్షణ అధికారుల కోసం ఏకంగా ఇక్కడ ఒకక్యాంపును ఏర్పాటుచేశారు. ఈఈ మొదలుకొని పలువురు డీఈఈలు, ఏఈఈలు, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది కోసం 1978లో క్వార్టర్లు ఆఫీసులు నిర్మించారు. ఓ మాదిరి కాలనీయే ఇక్కడ నిర్మించారు. వాటర్‌ట్యాంకు, తద్వారా అన్ని ఆఫీసులకు, క్వార్టర్లకు పైప్‌లైన్లు వేసి నేరుగా నల్లాలద్వారా నీటి సరఫరా ఏర్పాటు చేశారు. కాలనీ నలువైపులా చక్కటి రోడ్లను తీర్చిదిద్దారు. అందమైన మొక్కలు నాటి చెట్లను పెంచారు. ఒకపుడు సుల్తానాబాద్ పట్టణానికే ఈ ఎస్సారెస్పీ క్యాంప్ కొత్త కళ, శోభను తెచ్చింది.మొదట్లో అధికారులు, ఉద్యోగులు సిబ్బంది అందరూ ఈక్వార్టర్లలోనే నివాసం ఉండేవారు. కానీ ప్రస్తుతం ఎవరూ ఇక్కడ ఉండడం లేదు. కరీంనగర్ తదితర పట్టణాల నుంచిరాకపోకలు సాగిస్తూ విదులకు హజరవుతున్నారు. దాంతో రానురాను నిర్వహణ, పర్యవేక్షణలు కొరవడి ఈ క్యాంపును పట్టించుకోవడమే మానేశారు.

● కేవలం నాలుగు మాత్రమే వినియోగంలోకి..

విశాలమైన ఆవరణలో నిర్మించిన ఎస్సారెస్పీ క్యాంపు ప్రస్తుతం కళావిహీనంగా మారింది. డివిజన్ కార్యాలయం అంటే ఎవరూ నమ్మని తీరులో ఉంది. ఆఫీసు ముఖద్వారమే చెత్త చెదారంతో, శిథిలావస్థకు చేరిన క్వార్టర్లతో నిండి ఉంది. ప్రస్తుతం నాలుగు క్వార్టర్లను మాత్రమే వినియోగిస్తున్నారు. ఈఈ, డీఈఈ, రికార్డులతోపాటు మరో క్వార్టర్‌ను వినియోగిస్తున్నారు. అవి కూడా శిథిలావస్థకుచేరి ఉన్నవేకావడం గమనార్హం.. రాజుల సొమ్ములు రాళ్లపాలు అన్న చందంగా ప్రభుత్వ ఆస్తులు ఇలా నిరర్థకంగా పడి ఉండడాన్ని పలువురు గుర్తు చేసుకుంటూ ఆవేధన చెందుతున్నారు. భూముల ధరలు ఎక్కువగా ఉండడంతో ఈ భూములపై కన్నేసిన పలువురు వీటిని ఆ పేరుతో ఈ పేరుతో ఆక్రమించుకునే అవకాశాలు లేకపోలేదని పలువురు అంటున్నారు.

● ప్రహరీ నిర్మాణంతో ఆక్రమణలకు చెక్

\- ఎస్సారెస్పీ ఈ ఈ ప్రసాద్

సుల్తానాబాద్ ఎస్సారెస్పీ క్యాంపు గురించి, ఇక్కడ నిరుపయోగంగా, శిథిలావస్థకు చేరి ఉన్న క్వార్టర్ల, ఆఫీసుల గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాము. స్థలాన్ని ఆక్రమణకు గురికాకుండా చూడడానికి ముందు క్యాంపు చుట్టూ ప్రహరీని నిర్మించడానికి ప్రతిపాదనలు పంపించాము. ప్రహరీనిర్మాణం తర్వాత క్వార్టర్ల వినియోగం గురించి కూడా తగినచర్యలు తీసుకుంటాము. ఎవరు ఆక్రమణలకు పాల్పడ్డ చట్టరీత్యా చర్యలు తీసుకుంటాము. సుల్తానాబాద్ డివిజన్ పరిధిలోని పలుసబ్‌డివిజన్ కార్యాలయాలు కూడా తిరిగి యదాస్థానంలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.



కూలిపోతున్న క్వార్టర్లు

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

ముత్తారం మే 18 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ముత్తారం గ్రామ పంచాయతీకి చెందిన పింగిలిప్రమీల అనే వృద్ధురాలి మెడనుంచి గుర్తుతెలియని దొంగలు బంగారుగొలుసును అపహరించారు. ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధురాలిని శనివారం రాత్రి సమయంలో తలుపుతట్టడంతో వృద్ధురాలు తమబంధువులని తలుపుతీసింది. ఒక్కసారిగా మెడలో ఉన్న గొలుసులాక్కొని వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. వృద్ధురాలికి గాయాలుకాగా స్థానికులుపోలీసులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన వారు సంఘటన స్థలానికి చేరుకున్నారు. వృద్ధురాలు ఇచ్చిన ఫిర్యాదు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. త్వరలో దొంగలను పట్టుకొని కోర్టులో హాజరుపరుస్తామని ఎస్సై గోపతి నరేష్ తెలిపారు.

రేపటి నుంచి ఆర్జిత సేవలు రద్దు

మల్యాల, మే 18 (ఆంధ్రజ్యోతి): కొండగట్టులో మంగళవారం నుంచి గురువారం వరకు జయంతిఉత్సవాలు జరుగనుండగా ఆలయంలో ఆర్జితసేవలు నిలి పివేస్తున్నట్లు ఈవోశ్రీకాంత్‌రావు తెలిపారు. శుక్రవారం వరకు ఆర్జితసేవలు వాహనపూజలు, అభిషేకాలు, సత్యనారాయణవ్రతాలు ఉండవనిభక్తులు సహకరించాలని కోరారు. శనివారం నుంచి ఆర్జితసేవలు యధావిధిగా కొనసాగుతాయని ఈవో తెలిపారు.

కౌన్సెలింగ్‌తో వృద్ధుల కేసుల పరిష్కారం

జగిత్యాల అర్బన్, మే 18 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను పోషించక నిరాధరిస్తున్న కొడుకులకు,కోడళ్లకు జిల్లా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ కౌన్సెలింగ్ఇచ్చారు. ఈ సందర్భంగా వారు తల్లిదండ్రులను పోషిస్తూ వారిబాగోగులు చూసుకుంటామని ఒప్పంద పత్రం రాసి ఇచ్చినట్లు హరి అశోక్‌కుమార్ తెలిపారు. ఈసందర్భంగా హరిఅశోక్‌కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులను పోషించకుండా నిరాధరిస్తే రెవెన్యూడివిజనల్ అధికారి వయోవృద్ధుల ట్రిబ్యునల్ చైర్మన్ ఆరునెలలకు పైగా జైలుశిక్ష వేసే అవకాశం ఉందన్నారు. తల్లిదండ్రుల ఆస్తి రిజిస్ట్రేషన్ చేయించుకుంటే వాటిని తిరిగి స్వాధీనంచేసుకునే అవకాశం కలెక్టర్‌కు ఉందని ఆయన హెచ్చరించారు.

పోటెత్తిన భక్తజనం

- నాలుగో రోజు లక్షన్నర మంది పుణ్యస్నానాలు
- రద్దీగా మారిన రోడ్లు.. ఎట్టకేలకు వన్‌వే
- వారాంతపు సెలవుతో సందడిగా కాళేశ్వరం

కాళేశ్వరం, మే 18 (ఆంధ్రజ్యోతి): సరస్వతి నది పుష్కరాలకు ఆదివారం భక్తజనం పోటెత్తారు. పుష్కరతీరంతో పాటు కాళేశ్వరాలయం భక్తులతో కిటకిలాడాయి. వారాంతపు సెలవు కావడంతో కాళేశ్వరం పరిసరాలన్నీ ఆదివారం సందడిగా మారాయి. ఆదివారం మెయిన్ పుష్కరఘాట్‌లో సుమారు లక్షన్నర మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు.

● బారులు తీరిన వాహనాలు

ఆర్టీసీతో పాటు ప్రైవేటు వాహనాలు భారీగా తరలిరావడంతో రహదారులు కిక్కిరిసి పోయాయి. 15కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. దికారులు భక్తుల రాకను అంచనా వేయడంలో విఫలమవుతుండడంతోనే ట్రాఫిక్ సమస్య ఏర్పడిందనే విమర్శలు వస్తున్నాయి. మహదేవపూర్ నుంచి కాళేశ్వరం వరకు మొత్తం అటవీ ప్రాంతమవ్వడం.. అందులోనే 15 వరకు మూలమలుపులుండటంతో ట్రాఫిక్‌జాం అవుతోంది. దీంతో అధికారులు వన్‌వేను ప్రారంభించారు. పుష్కరస్నానాలు పూర్తిచేసుకున్న వాహనాలను అన్నారం, దామెరకుంట, గంగారం గ్రామాల మీదుగా పంపిస్తున్నారు. రద్దీ తగ్గితే మళ్లీ పాత మార్గంలోనే వాహనాలకు అనుమతిస్తున్నారు.

● ప్రముఖుల దర్శనాలు

సరస్వతీ పుష్కరాల్లో భాగంగా పలువురు ప్రముఖులు పుష్కరస్నానం ఆచరించారు. పుష్పగిరి పీఠాధిపతి అభినవోద్దండ విద్యాశంకర భారతీ మహాస్వామీతో పాటు సినీ నటుడు రాజేంద్ర ప్రసాద్, హైకోర్టు జడ్జి సుధా దంపతులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పుష్కర స్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయంలో కాళేశ్వర ముక్తీశ్వర స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.


సినీ నటుడు రాజేంద్రప్రసాద్‌తో భక్తులు


కాళేశ్వరం ఆలయం వద్ద భక్తుల రద్దీ

● సాఫీగా సాగిన దర్శనాలు..

మూడు రోజులుగా దర్శనాలకు సాధారణ భక్తులు ఇబ్బందులు పడగా ఆదివారం సర్దుకుంది. దేవాదాయ శాఖ అధికారులు దర్శనాలకు ప్రత్యేక చొరవ తీసుకోవడంతో దర్శనాలు సాఫీగా సాగాయి. క్యూలైన్ల వద్ద, ప్రధాన గోపురం వద్ద సిబ్బంది పర్యవేక్షించారు.

● ఆలయానికి వెళ్లేందుకు ఇబ్బందులు


పుష్కరాలకు వచ్చిన భక్తులకు దర్శన తిప్పలు తప్పడం లేదు. తాత్కాలిక ఆర్టీసీ బస్టాండు నుంచి పుష్కరఘాట్‌కు ఉచిత బస్సులు, ప్రైవేటు వాహనాలతో భక్తులకు వెళ్లేందుకు సదుపాయాలు కల్పించగా అక్కడి నుంచి ఆలయానికి వెళ్లేందుకు ఎలాంటి ఏర్పాట్లు లేవు. దీంతో భక్తులు ఇబ్బందిపడుతున్నారు.

● అందుబాటులోకి ఏరియల్ రైడ్..

సరస్వతి పుష్కరాల సందర్భంగా భక్తులు విహంగ వీక్షణం చేసేందుకు ఏరియల్ రైడ్ అందుబాటులోకి తెచ్చారు.


కాళేశ్వరంనకు వెళ్లేదారిలో బారులు తీరిన వాహనాలు

ఆదివారం నుంచి పుష్కరఘాట్ మార్గంలోని హెలిప్యాడ్ నుండి రైడ్స్‌ను ప్రారంభించారు. ఒక్కో భక్తుడు .4500 రూపాయలు చెల్లించి కాళేశ్వరాలయంతో పాటు త్రివేణి సంగమ పరిసరాలను జాయ్‌రైడ్స్‌లో చూపించనున్నారు. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోను ఈరైడ్స్‌కు టికెట్ బుక్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.




గోదావరికి హారతి ఇస్తున్న భక్తులు

జయంత్యుత్సవాలకు కొండగట్టు ముస్తాబు

మల్యాల, మే 18 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలకు కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం ముస్తాబు అవుతోంది. సోమవారం సాయంత్రం ఉత్సవాలకు ఆలయ అర్చకులు అంకురార్పణ కార్యక్రమాలు చేపట్టనుండగా మంగళవారం నుంచి స్వామి సన్నిధిలో హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల కోసం అంజన్న ఆలయంతో పాటు ఉప ఆలయాలకు రంగులు వేశారు. ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించే త్రయాహ్నిక త్రికుండాత్మక యజ్ఞంకు యాగశాలను సిద్ధం చేశారు. దిగువ కొండగట్టు, దొంగలమర్రి-జేఎన్‌టీయూ మార్గంలో, కొండపైన స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. ప్రతియేటా నిర్వహించే హనుమాన్ పెద్ద జయంతిని ఈసారి అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు రోజులపాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల నుంచి లక్షలాదిగా అంజన్న దీక్షాపరులు, భక్తులు కొండగట్టుకు చేరుకోనున్నారు. ఆలయానికి లైటింగ్ పనులు జరుగుతున్నాయి.


లడ్డూలు తయారు చేస్తున్న సిబ్బంది


వైజంక్షన్ ప్రాంతం నుంచి ఏర్పాటు చేస్తున్న పందిళ్లు

● అధికారుల పర్యవేక్షణ

కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో జరిగే హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలకు గాను భక్తులకు ఇక్కట్లు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. కొండపైకి వచ్చే భక్తులు అసౌకర్యానికి గురి కాకుండా ఏర్పాట్లపై ఇప్పటికే ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్ జిల్లా స్థాయి అధికారులు, దేవస్థానం అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. వందలాది పోలీసులచే బందోబస్తుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

వందేళ్ల సంబరం..

- వృద్ధురాలికి నూరేళ్ల పుట్టిన రోజు
- కుటుంబ సభ్యుల అనుబంధాన్ని చాటిన వేడుక

గంభీరావుపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలకేంద్రంలో మెళ్ల రామవ్వ అనే వృద్ధురాలి 100వ పుట్టిన రోజు సంబరాలను కుటుంబసభ్యులు ఘనంగా నిర్వహించారు. రామవ్వకు ఆదివారంతో 100ఏళ్లు నిండాయి. మండల కేంద్రంలోని ముదిరాజ్ ఫంక్షన్ హాల్‌లో కుటుంబ సభ్యులు అందరూ ఒకచోట చేరి రామవ్వతో కేక్ కట్ చేయించారు. ఆటా పాటలతో సాగిన ఈ వేడుక కుటుంబ సభ్యుల అనుబంధాన్ని చాటి చెప్పింది. కార్యక్రమంలో రామవ్వ కుమారులు, కుమార్తెలు, కోడళ్లు, అల్లుళ్లు, మనవలు, మనవరాళ్లు, మునిమనవలు, మునిమనవరాళ్లు సమష్టిగా నిర్వహించారు. దాదాపు రామవ్వకు ముగ్గురు కొడుకులు, నలుగురు కూతుళ్లు కాగా, మొత్తం కుటుంబ సభ్యులు 70 మంది వరకు ఉన్నారు.


100 ఏళ్ల పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న రామవ్వ

కొండగట్టులో భక్తుల సందడి


కొండగట్టు ఆలయం ముందు భక్తులు

మల్యాల, మే 18 (ఆంధ్రజ్యోతి): సరస్వతీ నది పుష్కరాల నేపథ్యంలో కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో పుష్కర భక్తులతో కోలాహలం నెలకొంది. కాళేశ్వరంలోని సరస్వతీ నది పుణ్యస్నానాలకు వెళ్తున్న భక్తులు, తిరిగి వస్తున్న భక్తులు మార్గమధ్యంలోని కొండగట్టు అంజన్నను దర్శించు కుంటున్నారు. దీంతోరెండురోజులుగా కొండగట్టు భక్తులతో రద్దీగా మారింది.

గోపాలమిత్రల గోడు పట్టేదెవరికి?

- వేతనాలు అందక ఇబ్బందులు
- ఎనిమిది నెలలుగా పెండింగ్
- రాష్ట్రంలో 1,530 గోపాలమిత్రలు


జగిత్యాల జిల్లా గొల్లపల్లిలో పశువులకు టీకాలు ఇస్తున్న గోపాలమిత్రలు

జగిత్యాల, మే 18 (ఆంధ్రజ్యోతి): పశు సంవర్ధక శాఖలో పనిచేస్తున్న గోపాల మిత్రల గోడు పట్టించుకునే వారు లేకుండా పోయారు. పశు పోషకులకు సహాయ సహకారాలు అందించే ందుకు పశువైద్య శాలల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన గోపాల మిత్రలకు ఎనిమిది నెలలుగా వేతనాలు అందడం లేదు. వచ్చే అరకొర వేతనం సైతం సకాలంలో అందకపోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. కుటుంబ పోషణ భారంగా మారుతుండడంతో ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నారు.

● పశువైద్యంలో కీలకపాత్ర

పశు సంవర్ధక శాఖలో గోపాల మిత్రలు కీలకపాత్ర పోషిసున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1530 మంది గోపాల మిత్రలుండగా, జగిత్యాల జిల్లాలో 22 మంది పనిచేస్తున్నారు. పశువులకు కృతిమ గర్భధారణ చేయడంతో పాటు మేకలు, గొర్రెలకు ప్రాథమిక వైద్య అందిస్తుంటారు. అదే విధంగా పశువులకు వాక్సినేషన్లు వేయడంలో, కృతిమ గర్భధారణ లక్ష్యాలు నెరవేర్చడంలో గోపాలమిత్రలు కీలకంగా వ్యవహరిస్తుంటారు. పశువుల సంఖ్య మేరకు గోపాలమిత్రలకు కృతిమ గర్భధారణ టార్గెట్లు నిర్ణయిస్తున్నారు. ఒక్కో గోపాలమిత్రకు నెలకు వంద కృతిమ గర్భాధారణ చేయాల్సి ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతులు సహజ గర్భధారణకు ప్రాధాన్యం ఇస్తుంటారు. దీంతో గోపాల మిత్రలు టార్గెట్లు పూర్తి చేయడంలో ఇక్కట్లు ఎదుర్కొం టున్నారు. కొన్ని సందర్భాల్లో టార్గెట్లు రీచ్ కాలేందటూ గౌరవ వేతనాల్లో కోత విధిస్తున్నారని గోపాలమిత్రలు వాపోతున్నారు. పలుమార్లు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్య తీసుకవెళ్లినా ఫలితం ఉండడం లేదంటున్నారు.

● ఎనిమిది నెలలుగా వేతనాలు పెండింగ్

గోపాల మిత్రలకు ఒక్కొక్కరికి నెలకు రూ. 11,050 గౌరవ వేతనంగా ప్రభుత్వం చెల్లిస్తోంది. 2024 సెప్టెంబరు నుంచి 2025 ఏప్రిల్ వరకు ఎనిమిది నెలల గౌరవ వేతనం అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ఎనిమిది నెలలకు పైగా చిల్లిగవ్వ చేతికి రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారి ఇబ్బందుల పాలవుతున్నారు. ఇచ్చే అరకొర వేతనాల్లో కోతలు విధిస్తుండడం, నెల నెలా చెల్లించకపోవడంతో అప్పు చేస్తూ కుటుంబాలను నెట్టుకొస్తున్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

- వేములవాడ గంగారం, గోపాలమిత్ర సంఘం జిల్లా అధ్యక్షుడు, జగిత్యాల



పశు సంవర్ధక శాఖలో పనిచేస్తున్న గోపాలమిత్రలకు రావాల్సిన తొమ్మిది నెలల పెండింగ్ వేతనాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి. ఏ నెలకు ఆ నెల గౌరవ వేతనం అందేలా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలి. ఇచ్చే అరొకర వేతనాలు ఎప్పటికప్పుడు అందకపోవడంతో అవస్థల పాలవుతున్నాం.

ఇబ్బందులు పడుతున్నాం

-చెరుకు శ్రీనివాస్, గోపాలమిత్రల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు,



పశు సంవర్ధకశాఖలో పనిచేస్తున్న గోపాలమిత్రలకు సక్రమంగా వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నాం. మా కష్టానికి తగ్గట్టుగా వేతనాలు ప్రతినెలా చెల్లించాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి.

బడ్జెట్ విడుదల కావాల్సి ఉంది

- డాక్టర్ కె. వేణుగోపాల్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, జగిత్యాల



గోపాలమిత్రలకు అందించే గౌరవ వేతనాల బడ్జెట్ విడుదల కావాల్సి ఉంది. జిల్లాలో పనిచేస్తున్న గోపాలమిత్రల వివరాలను ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు పంపుతున్నాం. బడ్జెట్ కేటాయిస్తే వారి బ్యాంకు ఖాతాల్లో వేతనాలు జమ అవుతాయి.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

- దర్శనానికి రెండు గంటల సమయం
- రాజన్న సేవలో మహానాథ్ మహేంద్ర దాస్‌జీ

వేములవాడ కల్చరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి క్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు రాజన్న కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకుని ఆయాక్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్నారు. రాజన్నకు ఇష్టమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు సుమారుగా రెండు గంటలపాటు క్యూలైన్‌లో బారులుతీరి రాజన్నను దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులకు తలెత్తకుండా ఆల యాధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిం చారు.


రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

రాజన్న సేవలో అయోధ్య లవకుశ జన్మభూమి తీర్థక్షేత్ర అధ్యక్షుడు..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని అయోధ్యలవకుశ జన్మభూమి తీర్థక్షేత్ర అధ్యక్షుడు మహానాథ్ మహేంద్రదాస్‌జీ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం అద్దాలమండపంలో అర్చకులు ఆశీర్వచనం ఇచ్చారు. ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.


రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకుంటున్న మహానాథ్ మహేంద్ర దాస్‌జీ

● న్యూస్‌బాక్స్

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

కరీంనగర్ టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 38వ డివిజన్‌లోని ముగ్గురు లబ్ధిదారులకు మంజూరైన రూ.2లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మాజీ కార్పొరేటర్ కచ్చు రవి ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సహకారంతో చెక్కులు మంజూరయ్యాయని తెలిపారు. ఇంటింటికి వెళ్లి లబ్ధిదా రులకు చెక్కులు అందజేశామని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై గంగుల విమర్శలు విడ్డూరం

కరీంనగర్ అర్బన్, మే 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి అంజనేయులు గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చూసి ఓర్చుకోలేక పోతున్నారని మండిపడ్డారు. కరీంనగర్‌ను నాలుగు జిల్లాలుగా విడదీసిన ఘనత బీఆర్‌ఎస్‌ది కాదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు కేటాయించిందని తెలిపారు. కొత్త రేషన్ కార్డులు ఇచ్చేది కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. కరీంనగర్ జిల్లా ప్రజలకు ఏం చేశారో పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో జిల్లా కేంద్రాన్ని ఏం అభివృద్ధి చేశారో గంగుల కమలాకర్ శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పట్టువస్త్రాల సమర్పణ

కరీంనగర్ కల్చరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విద్యానగర్ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నగరంలోని 39, 17వ డివిజన్‌కు చెందిన పద్మశాలీలు లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామికి పుస్తెమట్టెలు, పట్టువస్త్రాలు, తలంబ్రాలు, సారె సమర్పించారు. వరసిద్ధి వినాయక దేవాలయం నుంచి వెంకటేశ్వరస్వామి దేవాలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. డివిజన్ల ఇన్‌చార్జిలు చంద్రశేఖర్, కనకయ్య, పట్టణ పద్మశాలి సంఘం అధ్య క్షుడు గడ్డం శ్రీరాములు, పోపా జిల్లా అధ్యక్షుడు పోలు సత్యనారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి వంగర ఆంజనేయులు, కోశాధికారి కనుకయ్య పాల్గొన్నారు.

గత పాలకుల తప్పిదాలతోనే ప్రజాధనం వృథా

- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

కరీంనగర్ అర్బన్, మే 18(ఆంధ్రజ్యోతి): గత పాలకుల తప్పిదాలతో కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అయ్యిందని, దానికి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిందించడమేంటని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మండిపడ్డారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కరీంనగర్ కళలతో, కళాకారులతో, అభివృద్ధి సంక్షేమంతో కళకళలాడుతోందని, పచ్చ కామెర్లోళ్లకు మాత్రం లోకమంతా పచ్చగానే కనిపిస్తుందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డిని, మాజీ బీఆర్‌ఎస్ నాయకులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ఎవరి ప్రమేయమూ లేకుండా సాగుతోందని, అధికారులకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చామని అన్నారు. గత బీఆర్‌ఎస్ పాలనలో ఏ పథకమైనా పింక్ చొక్కాలకు మాత్రమే వర్తించేదని, నిజమైన అర్హులకు అన్యాయం జరిగిందని అన్నారు. కేబుల్ బ్రిడ్జిపై డైనమిక్ లైటింగ్ కోసం ఆరు కోట్లు ఖర్చు పెట్టారని, టెండర్ ప్రక్రియలో దాని బాధ్యత భద్రత మరచిపోవడంతో వెలిగించిన నెల రోజుల్లోనే విలువైన సామగ్రి దొంగల పాలైందని, దానికి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిందించడమేంటని ప్రశ్నించారు. ఐలాండ్ల సుందరీకరణ పేరిట కోట్లాది రూపాయల ప్రజా ధనం ఖర్చు పెట్టారని, నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో రెండు మూడు సంవత్సరాలలోపే ఎక్కడి కక్కడ ఊడి పోతున్నాయని అన్నారు. స్మార్ట్ సిటీ నిధులు రూ.16 కోట్లు ఖర్చు పెట్టి డంపుయార్డులో బయో మైనింగ్ మిషన్ ఏర్పాటు చేస్తే అది ఎందుకు పనికి రాకుండా పోయిందని, దానికి బాధ్యత ఆనాటి బీఆర్‌ఎస్ పాలకవర్గానిది, కేంద్ర ప్రభుత్వ నాయకులది కాదా? అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ నాయకుల వైఖరి దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. అభివృద్ధి, సంక్షేమంపై ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారన్నారు. సమావేశంలో దన్నసింగ్, జీడీ రమేష్, కోడూరి రవీందర్ గౌడ్, బత్తిని చంద్రయ్య, మార్క రాజాగౌడ్, నదీమ్, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ దేవాలయం వద్ద బోరు ఏర్పాటు

శంకరపట్నం, మే 18 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం గద్దపాక హనుమాన్ దేవాలయం వద్ద భక్తుల సౌకర్యార్థం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ నిధుల నుంచి బోరు ఏర్పాటు చేసినట్లు జిల్లా అధికారప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జంగా జైపాల్, రమణారెడ్డి, జంగా సతీస్, హనుమాన్ దీక్ష స్వాములు తదితరులు పాల్గొన్నారు.

సీఐని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

జమ్మికుంట, మే 18 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణ సీఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎస్. రామకృష్ణగౌడ్‌ను ఆదివారం కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సుంకరి రమేష్, గూడెపు సారంగపాణి, మొలుగూరి సదయ్య, ఎర్రం సతీష్‌రెడ్డి, గడ్డం దీక్షిత్‌గౌడ్, పాతకాల అనిల్, పంజాల అజయ్, తదితరులు పాల్గొన్నారు.

22న హిందూ ఏక్తా యాత్ర



స్టిక్కర్లు అంటిస్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్ టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): హిందూ ఏక్తా యాత్రను విజయవంతం చేయాలని నగరంలోని 59వ డివిజన్‌లో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు, శక్తి కేంద్ర ఇన్‌చార్జి రెడ్డెడ్డి శ్రీనివాస్ కోరారు. ఈ నెల 22న నిర్వహించనున్న హిందూ ఏక్తా యాత్ర, 19న నిర్వహించనున్న తిరంగా యాత్రను విజయవంతం చేయాలని కోరుతూ స్టిక్కర్లను అంటించారు. ఆంజనేయులు, పెదత్తి లావణ్య, దయ్యాల కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

షానగర్ బూత్ కమిటీ అధ్యక్షుడిగా రమణాచారి

రామడుగు, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని షానగర్ బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుడిగా బొమ్మగంటి రమణాచారిని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ వాకర్స్ అసోసియేషన్

హుజూరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ వాకర్స్ అసోసియేషన్ పాలకవర్గం ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. ఇటీవల అధ్యక్షుడిగా కొమురవెల్లి హరిప్రసాద్, ఉపాధ్యక్షుడిగా మండల యాదగిరి, కోశాధికారిగా చింతకుంట్ల శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగతా పాలకవర్గసభ్యుల కోసం ఎన్నికలు నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా మథిన్, సంయుక్త కార్యదర్శిగా కోట సంపత్, డైరెక్టర్లుగా ముషం రాజేంద్రం, కందుల రమేష్, తేలుకుంట్ల వేణు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి వీరస్వామి తెలిపారు.

రోడ్డుపై గుంతల పూడ్చివేత



గుంతలు పూడ్చివేయిస్తున్న పరశురామ్‌రావు

జమ్మికుంట రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం శాయంపేట గ్రామ శివారులోని రోడ్డుపై ఏర్పడిన గుంతలను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పరశురామ్‌రావు సొంతఖర్చులతో ఆదివారం పూడ్చివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంతలతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పలుమార్లు ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా స్పందించడం లేదన్నారు. దీంతో తానే సొంత ఖర్చులతో పూడ్చివేయించినట్లు చెప్పారు.

నగరంలో ఎయిడ్స్ మెమోరియల్ క్యాండిల్ లైట్ ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న అదనపు వైద్య, ఆరోగ్యశాఖాధికారి సుధ

సుభాష్‌నగర్, మే 18 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఎయిడ్స్ మెమోరియల్ క్యాండిల్ లైట్ డే సందర్భంగా ఆదివారం సాయంత్రం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా అదనపు వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సుధ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం మే 18న అంతర్జాతీయ క్యాండిల్ మెమోరియల్ కార్యక్రమం ఎయిడ్స్ వ్యాధితో కోల్పోయిన వ్యక్తులను స్మరించుకోవడానికి, హెచ్‌ఐవీతో జీవిస్తున్న వారికి సంఘీభావం తెలపడానికి, అవగాహన కల్పించడానికి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సిబ్బంది, ఎన్‌జీవో కార్యకర్తలు పాల్గొన్నారు.

పాకిస్థాన్ దుశ్చర్యలను తెలుసుకోవాలి

సుభాష్‌నగర్, మే 18 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ దుశ్చర్యలను భారతీయులు తెలుసుకోవాలని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. ఆదివారం నగరంలోని ప్రజామిత్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారత్‌పై పాకిస్థాన్ తీవ్రవాద కార్యకలాపాలను అర్థం చేసుకోవాలంటే దాని వెనుక ఉన్న చరిత్రను అధ్యయనం చేయాలన్నారు. ఎప్పటి నుంచో విషం చిమ్ముతూ అనేక విద్రోహ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. కొన్ని దేశాలు పాకిస్థాన్‌ను ముందుపెట్టి కుట్రలు చేస్తున్నాయన్నారు. రష్యా అప్పుడు, ఇప్పుడు భారత్‌కు మిత్రదేశంగా ఉందన్నారు. ఈ విషయాలపై కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, జాతీయ రాజ కీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీలు, సామాజిక సంస్థలు, మేధావులు ప్రజలను చైతన్యపర చాలని కోరారు. ఈ సమావేశంలో కొంపెల్లి రవీందర్, గాజం నరేందర్, భైరం రాజేందర్, శ్రీరాముల కిషన్, నాగరాజు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన

కమాన్‌పూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): కమాన్‌పూర్ గ్రామపంచాయితీ పరిధిలోని పిల్లిపల్లెలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఆదివారం ప్రారంభమయింది. వేద పండితుల ఆధ్వర్యంలో భక్తులు కుంకుమ పూజలు చేశారు. ఉదయాన్నే హోమం, గణపతి పూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

అసంపూర్తి పనులు.. గ్రామస్థుల అవస్థలు



అన్నారంలో నిలిచిన మురికికాలువ నిర్మాణం

మానకొండూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా చేపట్టిన పనులతో మండలంలోని అన్నారం గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మానకొండూర్ నుంచి జమ్మికుంట వరకు డబుల్ రోడ్డు నిర్మాణంలో భాగంగా గ్రామంలో తారు రోడ్డు నిర్మించి డ్రెయినేజీ పనులు చేపట్టకపోవడంతో మురికి నీరు నిలిచి గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఉన్న రోడ్డు కంటే డబుల్ రోడ్డు నిర్మాణంలో భాగంగా సుమారు మీటరు వరకు ఎత్తును పెంచి అసంపూర్తిగా తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు. గ్రామంలో సగం వరకు మురికి కాల్వ నిర్మాణం చేపట్టి మరో సగం వరకు వదిలేశారు. దీంతో గతంలో ఉన్న మురికి కాలువ కిందికి కావడంతో ఇళ్ల నుంచి వచ్చే నీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. దుర్వాసన భరించలేకపోతున్నట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

- కన్నుల పండువగా హంసవాహనసేవ, ఎదుర్కోలు వేడుక



ఎదుర్కోలు వేడుక నిర్వహిస్తున్న అర్చకులు

కరీంనగర్ కల్చరల్, మే 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని విద్యానగర్ లక్ష్మీవేంకటేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా యజ్ఞాచార్యులు వానమామలై పవనకుమారాచార్యుల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం అగ్ని ప్రతిష్ఠ, నిత్య హవనాలు, ధ్వజారోహణ చేపట్టారు. సాయంత్రం శ్రీవారు అమ్మవార్లకు హంసవాహసేవ, ఎదుర్కోలు వేడుక కన్నుల పండువగా నిర్వహించారు. అధ్యక్ష కార్యదర్శులు శ్రీరాం భద్రయ్య, గుడిపాటి శంకర్‌రెడ్డి, కోశాధికారి దూలూరు సత్యనారాయణ, ఉపాధ్యక్షులు మీరయ్య, రాంరెడ్డి, మల్లారెడ్డి, అంజిబాబు పాల్గొన్నారు. సోమవారం ఉదయం నిత్య పూజలు, హవనం అనంతరం 10-30 గంటలకు శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సం జరుగనున్నట్లు, సాయంత్రం రథోత్సవం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు



కాచాపూర్ చెరువులో ట్రాక్టర్లపై అక్రమంగా తరలిస్తున్న మట్టి

శంకరపట్నం, మే 18 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కాచాపూర్ ఊరచెరువు మట్టిని దళారులు అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని గ్రామస్థులు ఆరోపించారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండా సెలవు దినాలే లక్ష్యంగా చేసుకొని చెరువు మట్టిని అక్రమంగా తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారన్నారు. సంబంధిత శాఖ అధికారులు చొరవతీసుకొని క్షేత్రస్థాయిలో పర్యటించి వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఘనంగా అంతర్జాతీయ స్విమ్మింగ్ దినోత్సవం



బాలబాలికలకు బహుమతులు అందజేస్తున్న క్లబ్ నిర్వాహకులు

హుజూరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని క్లబ్‌లో అంతర్జాతీయ స్విమ్మింగ్ దినోత్సవం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా బాలబాలికలకు స్విమ్మింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన బాలబాలికలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎర్రం నారాయణరెడ్డి, ముచ్చం నారాయణరెడ్డి, కిషన్‌రెడ్డి, నారాయణరెడ్డి, రాజు, సమ్మన్న, శ్రీనివాస్, సురేష్, సృజన్, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సాంబశివరెడ్డి, రాజలింగారెడ్డి, రవీందర్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మానకొండూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లోని చాణక్య ఉన్నత పాఠశాలలో 2001-02వ బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు ఆదివారం తాము చదివిన పాఠశాలలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి మెమెంటోలు అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు సహపంక్తి భోజనం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆడెపు రవీందర్, శకుంతల, పద్మారెడ్డి, వైద శ్రీధర్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

హిందూ ఏక్తాయాత్రను విజయవంతం చేయండి

శంకరపట్నం, మే 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ఈనెల22న నిర్వహించే హిందూ ఏక్తాయాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీజిల్లా అధికార ప్రతినిధి, సెంట్రల్ ఫిలిం సెన్సార్‌బోర్డు సభ్యుడు బొంతల కళ్యాణ్‌చంద్ర అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో బీజేపీ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో 13రోజులుగా ఏక్తాయాత్ర కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందన్నారు. ప్రతిఏటా హనుమజ్జయంతి నాడు హిందువులు సంఘటిత శక్తి, స్వాభిమానాన్ని చాటేందుకు హిందూ ఏక్తాయాత్రను బండి సంజయ్‌కుమార్ నిర్వహిస్తున్నారన్నారు. శంకరపట్నం మండల బీజేపీశ్రేణులు హిందూ ఏక్తాయాత్రను విజయవంతం చేయడానికి కృషి చేయాలన్నారు. అనంతరం హిందూఏక్తాయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి మాడ వెంకటరెడ్డి, నాయకులు దొంగల రాములు, జంగ జైపాల్, దాసారపు నరేందర్, కొయ్యడ అశోక్, రాసమల్ల శ్రీనివాస్, కనకం సాగర్, బిజిలి సారయ్య, నిమ్మశెట్టి సంపత్, పోతునూరి రాజు, సాయిప్రకాష్, రాజేందర్, రాజు, అనిల్, తిరుపతి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



శంకరపట్నంలో హిందూ ఏక్తాయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీజేపీ శ్రేణులు

గన్నేరువరం: హిందూ ఏక్తాయాత్రలో హిందువులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని హిందూ ఏక్తాయాత్ర మండల ఇన్‌చార్జ్ కరివేద మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో బీజేపీ మండల అధ్య క్షుడు తిప్పర్తి నికేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన హిందూఏక్తాయాత్ర సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హిందువులపై, హిందూధర్మంపై జరుగుతున్న దాడులను తిప్పికొట్టి హిందువుల ఐక్యతను చాటిచెప్పాలని అన్నారు. మండలంలోని ప్రతిగ్రామం నుంచి హిందువులు అధికసంఖ్యలో తరలిరావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విలాసాగరం రామచంద్రం, బండి తిరుపతి, కాంతాల రాజిరెడ్డి, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



గన్నేరువరంలో మాట్లాడుతున్న కరివేద మహిపాల్‌రెడ్డి

సైదాపూర్: మండలకేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో హిదూ ఏక్తాయాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. ఈనెల 22న హనుమాన్ జయంతి సందర్భంగా బండి సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో హిందూ ఏక్తాయాత్ర నిర్వహిస్తున్నట్లు, ఈయాత్రలో సైదాపూర్ మండలం నుంచి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

హుజూరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పరిధిలోని ఇప్పల్‌నర్సింగాపూర్‌లో శనివారం రాత్రి హనుమాన్ శోభాయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ మాలధారులు భజనలు చూస్తూ స్వామివారిని ఊరేగించారు.

మానకొండూర్: మానకొండూర్‌లో ఆదివారం హనుమాన్ మాలధారులు ఈనెల22న జరిగే హనుమాన్ జయంతిని పురస్కరించుకొని బాలాంజనేయస్వామి ఆలయం నుంచి శోభాయాత్రను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమటీ అధ్యక్షుడు నందగిరి బలరాం, ప్రధాన కార్యదర్శి బొల్లం నారాయణ, ఉపాధ్యక్షుడు పున్నం రాజు, కోశాధికారి బొమ్మెరవేణి మల్లేశ్, హనుమాన్ మాలదారులు పాల్గొన్నారు.



హుజూరాబాద్: ఇప్పల్‌నర్సింగాపూర్‌లో శోభాయాత్ర

రామడుగు: మండలంలోని రామచంద్రపురంలో ఆదివారం హను మాన్ శోభాయాత్ర వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా హనుమాన్ దీక్షాపరులు పాటలుపాడుతూ.. నృత్యాలుచేస్తూ.. శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామధర్మ రక్షాసమితి సభ్యులు, మండల ధర్మజాగరణ సమన్వయ కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



మానకొండూర్‌లో హనుమాన్ శోభాయాత్ర



రామడుగు: రామచంద్రాపురంలో హనుమాన్ శోభాయాత్ర

రోడ్డు నిర్మాణం పూర్తి చేయరూ..



అన్నారంలో పూర్తికాని తారు రోడ్డు నిర్మాణం

మానకొండూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ నుంచి జమ్మికుంట వరకు ఏడేళ్ల క్రితం డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. మండల కేంద్రం నుంచి పచ్చునూర్ గ్రామం వరకు 15కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా చేపట్టారు. మానకొండూర్, అన్నారం గ్రామాల మీదుగా ఈ అసంపూర్తి రోడ్డు ఉంది. దీంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అన్నారం గ్రామంలో సుమారు 200మీటర్ల వరకు ఇప్పటికీ తారు వేయకపోవడంతో దుమ్ముధూళి వాహనదారుల కళ్లల్లో పడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. కంకర పోసి వదిలేయడంతో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి పడిపోతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తి చేయించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.